క్లుప్తంగా

ఎస్పీ ప్రతాప శివకిషోర్‌కు అభినందనలు



ఎస్పీ ప్రతాప శివకిషోర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కుమరేశ్వరన్

ఏలూరు టౌన్ : ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్‌ను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమరేశ్వరన్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లాలో మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు.

శాస్త్రోక్తంగా గురుదత్త హోమం



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పాత బస్టాండు సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో గురుపౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలోని సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పాదర్తి జ్యోతి భక్తబృందానికి చెందిన 108 మంది భక్తులతో ఏకకాలంలో గురు చరిత్ర, షిరిడీ సాయినాథుని చరిత్రపారాయణం, మూకపంచశతి, ఆర్యశతక పారాయణం చేశారు.

గుడిలోకి దూసుకెళ్లిన లారీ

ఏలూరు టౌన్: ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారిలో మాదేపల్లి రోడ్డు పక్కన ఉన్న గంగానమ్మ ఆలయంలోకి రొయ్యల లోడు లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను స్థానికులు 108 అత్యవసర అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గంగానమ్మ గుడి గోడ పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు, రేపు సీపీఎం సమావేశాలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో నిర్వహించే సీపీఎం జిల్లా కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 19న ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, 20వ తేదీన జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ హాల్‌లో సీపీఎం విస్తృత సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం హాజరవుతారని, ప్రజా సమస్యలపై చర్చించి, నిర్ణయాలు తీసుకోనున్నామని తెలిపారు.

ఖరీఫ్‌పై చిగురిస్తున్న ఆశలు

- మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలు
- వరి నారుకు జీవం
- 200 ఎకరాల్లో నారుమడులు


ఏలూరు రూరల్ : మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలు ఎండిపోతున్న వరినారుకు జీవం పోశాయి. రైతుల్లో ఖరీఫ్ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు ఏలూరు రూరల్ గ్రామాల్లో నారుమడులకు నీరు లేక రైతులు అల్లాడిపోయారు. రైతుల సంఘాల నాయకులు సాగునీరు విడుదల చేయాలని ఆర్‌బీకేల వద్ద ధర్నా చేశారు. ఏలూరు రూరల్ మండల ఆయకట్టు ఇటు కృష్ణ, అటు గోదావరి కెనాల్‌కు శివారున ఉంది. దీంతో ఏటా రబీతో పాటు ఖరీఫ్‌కు సైతం రైతులు సాగు నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా నాట్లు పూర్తి కావస్తుంటే, ఏలూరు మండల గ్రామాల్లో నారుకు నీరులేక రైతులు అవస్థలు పడుతుంటారు.

200 ఎకరాల్లో నారుకు జీవం

అల్పపీడనం ఏర్పడక ముందు ఏలూరు రూరల్ రైతులు ఖరీఫ్ సాగు చేయ్యాలా వద్దా అనే మీమాంసలో పడ్డారు. సాగు పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోయినా ప్రకృతి కనకరించదా అనే నమ్మకంతో వరినారు పోశారు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో పరిస్థితి మారింది. నారుమడుల్లో నీరు చేరింది. మరో రెండు రోజుల్లో రైతులు దుక్కు పనులు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారు.



మల్కాపురంలో నారుమడిలో చేరిన వర్షపు నీరు



పోణంగి గ్రామ చేలకు సాగునీరు విడుదల చేసిన దృశ్యం

వర్షాలపైనే ఆధారం



ఏటా సాగు నీటి భయాలు కొనసాగుతూనే ఉన్నాయి. మాకు వ్యవసాయం తప్ప మరో జీవనాధారం లేదు. అధికారులు అభయం ఇవ్వకపోయినప్పటికీ నారు పోశాం. నారు పోసి 15 రోజులయ్యింది. జూలై రెండో వారం వరకు వర్షాలు లేవు, కృష్ణా నుంచి సాగునీరు విడుదల చేయలేదు. ఈ ఏడాది ఖరీఫ్ చేయగలమా లేదా అనే భయం నెలకొంది. ఇప్పుడు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంత ధైర్యం ఇచ్చాయి. నారు బతికింది. సాగునీరు వదిలితేనే మా గ్రామంలో ఖరీఫ్ పనులు ముమ్మరమౌతాయి.

– తూతా నిరంజన్, రైతు, మల్కాపురం

వారం రోజుల్లో పుష్కలంగా నీరు



అధికారులు కృష్ణా కెనాల్ నుంచి సాగు నీటిని విడుదల చేశారు. మరోవారం రోజుల్లో ఏలూరు రూరల్ మండల గ్రామాలకు సాగునీరు చేరుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రైతులు పోసిన వరి నారు బతికింది. రైతుల్లో ధైర్యం వచ్చింది. రైతులు దుక్కు దున్నుకోవచ్చు. ప్రభుత్వం విడుదల చేసే నీటితో ఖరీఫ్ సాగు చేసుకోవచ్చు.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

మల్కాపురం, చొదిమెళ్ల, వెంకటాపురం, పోణంగి, చాటపర్రు, శనివారపుపేట, సత్రంపాడు, జాలిపూడి, మాదేపల్లి, లింగారావుగూడెం, బాబూఖాన్‌గూడెంతో పాటు పలు శివారు గ్రామాల్లో రైతులు సుమారు 200 ఎకరాల్లో వరి నారు పోశారు. ఇందుకు రూ.8 లక్షలు వెచ్చించి 250 క్వింటాల విత్తనాలు కొనుగోలు చేశారు. ప్రస్తుత వర్షాలతో 6,500 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల, కోర్స్ ఎంపికను ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కళాశాలలో బీఏ హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నతాయని వివరించారు.

బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు జూట్‌మిల్లు ఫ్లైవోవర్ బ్రిడ్జిపై మోటారు సైకిల్‌పై వెళుతోన్న ఇద్దరు వ్యక్తులను బస్సు ఢీకొనటంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు.. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వెంకట సీతామహాలక్ష్మి అనే వృద్ధురాలు, బాలాజీ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి వన్‌టౌన్ వైపు జూట్‌మిల్లు బ్రిడ్జిపై వెళుతున్నారు. ఇదే క్రమంలో అటువైపు నుంచి వస్తోన్న ఆర్‌టీసీ బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొనటంతో వారిద్దరి కాళ్లు గాయాలయ్యాయి. పోలీసులు ఈ ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

ఏలూరులో ఎడతెరిపిలేని వాన



ఏలూరు నగరంలో వర్షంలో రాకపోకలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అల్పపీడన ద్రోణి ప్రభావంతో నగరంలో గురువారం ఎడతెరిపి లేని వాన కురిసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వాన గురువారం రోజంగా విరామం లేకుండా కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, ఆఫీసులకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు వానలోనే వెళ్లాల్సి వచ్చింది. నగరంలోని రహదారులు వాన నీటితో ముగినిగి రాకపోకలకు అంతరాయం కలిగించాయి. డ్రెయిన్ల నుంచి మురుగు రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వెదజల్లింది. మరో మూడు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో నగర ప్రజలు తమకు కావాల్సిన కూరగాయలు, నిత్యావసరాలను గురవారం ఉదయమే తెచ్చిపెట్టుకున్నారు. కాగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానల కారణంగా తమ్మిలేరు పొంగే ప్రమాదం ఉండడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో సమస్యలను అధిగమించడానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

రైతాంగ హామీలను అమలు చేయాలి



ఐక్యతను చాటుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయాలని, అందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకొచ్చి దేశవ్యాప్తంగా ఒక ,దఫా రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతు, వ్యవసాయ కార్మికుడికీ పింఛన్ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబానికీ ఏడాది 200 పనిదినాలు, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులపై జీఎస్టీ రద్దు చేయాలని పేర్కొన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని, అమరవీరుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం, బీకేఎంయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కాంగ్రెస్ కిసాన్ సెల్, ఏఐటీయూసీ నాయకులు డేగా ప్రభాకర్, కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, పీబీవీ సుబ్రహ్మణ్యం, కేఎస్ఎస్ మూర్తి, ఎం.కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజాన్ని స్థాపిద్దాం



గుండుగొలను కూడలిలో సిబ్బంది మానవహారం

భీమడోలు : కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీలో గురువారం వైద్యాధికారిణి కె.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, రోగులకు అవగాహన కల్పించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కుష్టు నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని.. కుష్టు అంటు వ్యాధి కాదని, నివారణకు మందులు ఉన్నాయంటూ నినదించారు. పలు కూడళ్లలో మానవహారంగా ఏర్పడి ప్రజలను చైతన్యపర్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు 15 రోజుల పాటు పారదర్శకంగా, పగడ్బందీగా చేపట్టాలన్నారు. కుష్టును ప్రారంభదశలో గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు కనిపించినా, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బుడిమెలు, కన్ను రెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, నొప్పిగా ఉన్న నరాలు వంటి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి ఆరోగ్య చికిత్సను అందించాలని తెలిపారు. 2 నుంచి 5 మచ్చలు ఉన్నవారికి ఆరు నెలల పీబీ కేసులు, ఐదు కన్నా ఎక్కువగా ఉన్న వారిని ఎంబీ కేసులుగా గుర్తించి వారికి ఏడాది పాటు చికిత్స అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి, డీపీఎంఓ కె.సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.సత్యానందం, హెచ్‌ఈ మల్లేశ్వరి, ఎంపీహెచ్‌ఎస్ ఎస్‌కే నవీన్, ఎంపీహెచ్ డి.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	20
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	60	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10, 15
బెండకాయలు	34	కంద	50
పచ్చిమిర్చి	46	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	50
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	34	అల్లం	100-170
క్యాబేజీ	38	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-54	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	94
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	44

వన్‌స్టాఫ్ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): వన్‌స్టాఫ్ సేవలను మహిళలు వినియోగించుకోవాలని సీడీపీఓ ఎ.పద్మావతి సూచించారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వెంకట్రావు పేట స్కూల్‌లో మహిళలకు వన్‌స్టాఫ్ సెంటర్, ఉమెన్ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. వన్‌స్టాఫ్ ద్వారా అందించే సేవలు, బాధిత మహిళలకు అందించే తక్షణ సహాయం, మహిళా అభివృద్ధికి శిశుసంక్షేమ శాఖ ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ ఎ.పద్మావతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయ నోడల్ ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం దేవి, కార్యకర్తలు మౌనిక, ప్రియాంక, వన్‌స్టాప్ సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎం, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ సభలు

పెదపాడు : మండలంలోని 23 గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల వద్ద నిర్ణీత సమయంలో ఉపాధి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు. తోటగూడెంలో ఈనెల 19న నాయుడుగూడెం, తోటగూడెం, తాళ్లగూడెం, 20న ఏపూరు, కొక్కిరపాడు, కలపర్రు, 21న సత్యవోలు కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, 22న వీరమ్మకుంట, వట్లూరు, 23న రాజుపేట, అప్పనవీడు, పెదపాడు, 24న కొత్తూరు, ఎస్ కొత్తపల్లి, జయపురం 25 గుడిపాడు, పునుకొల్లు, గోగుంట కొణికి, వడ్డిగూడెం, వసంతవాడ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

6700 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

దెందులూరు: మండలంలో 6,700 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ తెలిపారు. గురువారం ఆయన దెందులూరులో వరినాట్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ సాగుపనులు యథాతథంగా సాగుతున్నాయని, 14 వేల ఎకరాలకు 6,700 ఎకరాల్లో నాటు పూర్తయ్యాయని రమేష్ చెప్పారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



గణపవరం లయన్స్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

గణపవరం: సామాజిక సేవా కార్యక్రమాల అమలులో లయన్స్ సంస్థకు మరేసంస్థ సాటిరాదని, లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని లయన్స్ ఇంటర్నేషనల్ డైరక్టర్స్ ఈపూరి సత్యనారాయణ, పర్వతనేని సుభాష్‌బాబు తెలిపారు. గణపవరం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గణపవరం లయన్స్‌క్లబ్ భవనంలో ఈపూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్య, ఆరోగ్యరంగాలతో పాటు పర్యావరణంపై లయన్స్ ప్రత్యేక సేవా కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సైట్ ఎట్ ఫస్ట్ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందికి ఉచితంగా కంటిచూపు అందించినట్లు చెప్పారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పచ్చిపులుసు నాగేశ్వరావు, ఉపాధ్యక్షులుగా కె.నాగశేషారావు, ఎస్ వీరనాగయ్య, కార్యదర్శిగా సత్తినీడి నాని, కోశాధికారిగా కె.విశారద ఇతర సభ్యులచే ఇన్‌స్టాలింగ్ అధికారి వేమా కోటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. వారిని పలువురు పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రముఖులు వెల్లంకి నరేష్, పోశింశెట్టి రామూర్తి, రావూరి నాగరాజు, కె.సత్యనారాయణ మూర్తి, లివింగ్‌స్టన్, ఎంజీపీ నర్సింహారావు, నారాయణ శ్రీను, వంకాయల పంచముఖి, కె.రామకృష్ణ, కిలారి రవి, చవ్వా రవి, కాకర్ల వినాయక, ఎం హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డుల అందజేత

పెదపాడు : కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులు పొందాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు గురువారం గ్రామంలో కౌలురైతుల సమావేశం నిర్వహించి సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ

దెందులూరు : హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ లభిస్తుందని, ద్విచక్రవాహనం నడిపే ప్రతి వ్యక్తీ నిర్లక్ష్యం వహించకుండా హెల్మెట్ ధరించాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. గురువారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ హమీద్, సిబ్బందికి హెల్మెట్లను డీఎస్పీ అందించారు. పోలీస్ శాఖ నుంచి అవగాహన, నిబంధనల అమలు చేయాలన్నది తన అభిప్రాయమన్నారు.